పకడ్బందీగా తనిఖీలు చేపట్టాలి

- ఎస్ఎస్‌టీ టీంలు అప్రమత్తంగా ఉండాలి
- కలెక్టర్, ఎన్నికల అధికారి రాహుల్‌రాజ్
- రామాయంపేట చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేసిన కలెక్టర్

రామాయంపేట, మార్చి 20 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా ఎస్ఎస్‌టీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రాహుల్‌రాజ్ ఆదేశించారు. రామాయంపేట మండలం అక్కన్నపేట వద్ద ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టీ, పోలీస్ చెక్‌పోస్టును బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనాలను తనిఖీ చేసి, చెక్ పోస్టు అధికారులకు పలు సూచనలు చేశారు. చెక్‌పోస్టు వద్ద ప్రతి వాహనాన్ని పరిశీలించి నగదు, మద్యంతోపాటు ఇతర కానుకలను తరలించకుండా అడ్డుకోవాలన్నారు. ప్రతి చెక్ పోస్టు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, సీ-విజిల్, 1950, టోల్‌ఫ్రీ నెంబర్ల ఉద్దేశాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రత్యేక నిఘా కోసం ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టీ బృందాలు మెరుగైన పనితీరు కనబర్చాలన్నారు. మెదక్ ఆర్డీవో రమాదేవి, రామాయంపేట తహసీల్దార్ రజినీకుమారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భిక్షపతి, ఆర్ఐ రాజు ఉన్నారు.

రామాయంపేట చెక్‌పోస్ట్ వద్ద కారు డిక్కీని పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి, కలెక్టర్

చిన్నారి మృతి బాధాకరం

సంగీత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి

శివ్వంపేట, మార్చి 20: కౌడిపల్లి మండలం పరిధిలోని జాజితండాలో చిన్నారి సంగీత మృతి చెందడం బాధాకరమని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం మాలోత్ సంగీత కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థికసాయం అందజేశారు. ప్రభుత్వ పరంగా ఆదుకోవడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు లకావత్ రమేశ్‌నాయక్ రూ. 5వేల ఆర్థికసాయం అందజేశారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ రాజునాయక్, వైస్ ఎంపీపీ నవీన్‌గుప్తా, ఎంపీటీసీ ప్రవీణ్‌కుమార్, మాజీ సర్పంచ్ లక్ష్య, శ్రీనివాస్‌నాయక్, గిరిజన విద్యార్థి నాయకులు శివాజీనాయక్ ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ ఎల్వోసీ అందజేత



ఎల్వోసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

శివ్వంపేట, మార్చి 20: శివ్వంపేట మండలం వెంక్యతండాకు చెందిన బానోత్ ప్రకాశ్ కూతురికి అత్యవసర చికిత్సకు సీఎంఆర్ఎఫ్ ఎల్వోసీ మంజూరైంది. బుధవారం ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి తదితరులు బానోత్ ప్రకాశ్ కుటుంబీకులకు రూ. 1.50లక్షల సీఎంఆర్ఎఫ్ ఎల్వోసీ పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ హరికృష్ణ, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు మన్సూర్, పీఏసీఎస్ చైర్మన్లు వెంకటరాంరెడ్డి, హన్మంత రావు, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, నాయకులు లాయక్, మర్రి మహేందర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి సహకరించాలి

ఎమ్మెల్యే రోహిత్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న విశ్వకర్మ, మనుమయ సంఘం నేతలు

రామాయంపేట, మార్చి 20: రామాయంపేట పట్టణంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణానికి సహకరించాలని మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావును విశ్వకర్మ, మనుమయ సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. బుధవారం రామాయంపేట మీదుగా నిజాంపేటకు ఎమ్మెల్యేను విశ్వకర్మ, మనుమయ సంఘం నాయకులు కలిశారు. వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణానికి స్థలంతో పాటు నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి సుప్రభాతరావు, కాంగ్రెస్ నాయకులు దోమకొండ యాదగిరి, అల్లాడి వెంకటేశ్, విశ్వకర్మ సంఘం నాయకులు కొడపర్తి లక్ష్మణాచారి, కమ్మరి యాదగిరి, పాండురంగాచారి, సుంకోజు దామోదర్‌చారి, వెంకటేశం, కమ్మరి చంద్రమౌళి, దమ్మయ్య, శ్రీనివాసచారి, కోనపురం వెంకటేశం, రామలుచారి ఉన్నారు.

రామంతాపూర్‌తండాలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

అందుబాటులో పోలింగ్ కేంద్రాలు

కొత్తగా 5 కేంద్రాల ఏర్పాటు

వెల్దుర్తి, మార్చి 20 : పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అందుబాటులో ఉండేలా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. మాసాయిపేట మండలం రామంతాపూర్‌తండాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రం వివరాలు, ఓటర్లు, గతంలో జరిగిన ఓటింగ్ శాతం వివరాలను రెనెన్యూ అధికారులు వివరించారు. తండాలో పరిస్థితులు, ఓటింగ్ సరళి, పోలింగ్ కేంద్రంలో కల్పించాల్సిన సౌకర్యాలపై ప్రజలు, అధికారులతో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. పోలింగ్ రోజు ఓటర్లకు ఎలాంటి సమస్యలు రాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. గతంలో ఓటర్లు పడిన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని జిల్లాలో నూతనంగా ఐదు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మెదక్ నియోజకవర్గంలో మూడు, నర్సాపూర్ నియోజకవర్గంలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఓటర్లు బాధ్యతగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. జిల్లావ్యాప్తంగా వందశాతం పోలింగ్ జరిగేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కలెక్టర్ వెంట నర్సాపూర్ అర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, ఎంపీడీవో జగదీశ్వరాచారి, ఎంపీవో విష్ణుశ్వర్, ఆర్ఐ ధన్‌సింగ్, కార్యదర్శి శ్రీధర్, హెచ్ఎం నవీన్ తదితరులు ఉన్నారు.

చెక్ పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉండాలి

చిన్నశంకరంపేట, మార్చి 20 : చెక్‌పోస్టుల వద్ద ఎస్ఎస్‌టీ టీం సభ్యులు అప్రమత్తంగా ఉండాలని జిలా ఎన్నికల అధికారి రాహుల్ రాజ్ సూచించారు. చిన్నశంకరంపేట చెక్‌పోస్టును పరిశీలించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ మన్నన్ ఉన్నారు.

సేవాదృక్పథం కలిగి ఉండాలి

ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో ఓయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ నవీన్ సౌద

ఓయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ నవీన్ సౌద

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 20: విద్యార్థులు సామాజిక, సేవాదృక్పథంలో ముందుండాలని ఉస్మానియా యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ నవీన్ సౌద అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన 80 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు స్వచ్ఛ కార్యాచరణలో భాగంగా కళాశాల ఆవరణను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సవీన్ సౌద ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు ప్రశంసాపత్రాలు ఆందజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న స్వచ్ఛ భారత్, హరితహారం కార్యక్రమాల్లో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొనాలని సూచించారు. సామాజిక సేవా, ప్రజా సమస్యలపై అవగాహన, వాటి పరిష్కారంపై నిర్మాణాత్మక అలోచనలతో ఎన్ఎస్ఎస్ వలంటీర్లలో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వాసంతి పిళ్లై, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీపీ సిద్ధిరాములు, బీఆర్ఎస్ నాయకులు

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

ఎకరానికి రూ. 20 వేలు ఇవ్వాలి

నిజాంపేట, మార్చి 20 : వడగండ్ల వర్షం కారణంగా పంటలు నష్టం పోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని ఎంపీపీ సిద్ధిరాములు డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దార్ సురేశ్‌కుమార్‌కు పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.20 వేల నష్టపరిహారం అందజేయాలని ఎంపీపీతో పాటు బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రైతు సంక్షేమమే లక్ష్యంగా కేసీఆర్ ప్రభుత్వం పని చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు చేయూత ఇవ్వాలన్నారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీ బాల్‌రెడ్డి, బీఆర్ఎస్ సోషల్ మీడియా మండలాధ్యక్షుడు అబ్దుల్ ఆజీజ్, మాజీ ఎంపీపీ సంపత్, ఏఎంసీ డైరెక్టర్ రవిగుప్త, నాయకులు మహేశ్, లక్ష్మణ్, కనకరాజు, పత్తినాయక్, నరేందర్ ఉన్నారు.

రామాయంపేటలో ఆర్చరీ పోటీలు

రామాయంపేట జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో ఆర్చరీ పోటీలు

రామాయంపేట, మార్చి 20 : విలువిద్య నేర్చుకుంటే ఏకాగ్రత పెరుగుతుందని యువ జ్యోతి క్లబ్ నిర్వాహకులు, ఫుట్‌బాల్ అసోషియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు బొంతల సత్యనారాయణ అన్నారు. బుధవారం పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో ఆర్చరీ పోటీలను ఆయన ప్రారంభిం చారు. రామాయంపేట, నిజాంపేట మండలాలకు సంబంధించిన విద్యార్థులు, యువకులు ఆర్చరీ నేర్చుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతిరోజూ రామాయంపేట ప్రభుత్వ కళాశాలలో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో అర్చరీ శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మెట్టు గంగారాం, వీహెచ్‌పీ మండలాధ్యక్షుడు సంగమేశ్వర్‌గుప్తా, నాయకులు పాతూరి రాజు, లద్ద నర్సింహులు, చింతల శేఖర్, శంకర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

నేడు తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక

తూప్రాన్, మార్చి 20 : గురువారం ఉదయం 11 గంటలకు ప్రారంభకానున్న మున్సిపల్ సమావేశంలో మన్సిపల్ చైర్మన్‌ను ఎన్నుకోనున్నారు. చైర్మన్ రేసులో ఇన్‌చార్జి చైర్మన్ నందాల శ్రీనివాస్, 4వ వార్డు కౌన్సిలర్ మామిండ్ల జ్యోతీకృష్ణ ఉన్నారు. ప్రస్తు తం కౌన్సిలర్లు క్యాంపులో ఉండగా, చైర్మన్ ఎవరవుతారనే ఉత్కంఠత నెలకొన్నది. మాజీ చైర్మన్ రాఘవేందర్‌గౌడ్ విధానాలకు నిరసనగా 11 మంది కౌన్సిలర్లు ఫిబ్రవరి 12న అవిశ్వాస తీర్మాన నోటీసును అప్పటి కలెక్టర్ రాజర్షిషాకు అందజేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాలతో మార్చి 6న బలపరీక్ష నిర్వహించారు. బలపరీక్ష సమయంలో 2వ వార్డు కౌన్సిలర్ మామిడి వెంకటేశ్ తిరిగి రాఘవేందర్‌గౌడ్‌కు మద్దతు ఇవ్వగా, అవిశ్వాస ఓటింగ్‌కు మరొక కౌన్సిలర్ అవసరమేర్పడింది. దీంతో అవిశ్వాసానికి మద్దతుగా ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి ఓటేశారు. ఫలితంగా రాఘవేందర్‌గౌడ్‌పై అవిశ్వాసం నెగ్గినట్లు ప్రిసైడింగ్ అధికారి, ఆర్డీవో జయచంద్రారెడ్డి ప్రకటించి, ఎన్నికల కమిషన్‌కు నివేదించారు. ఈ నెల 21న చైర్మన్ ఎన్నిక నిర్వహించాలని ఎలక్షన్ కమిషన్ ఆదేశాలిచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ ఖాజామొయిజుద్దీన్ తెలిపారు. నేటితో చైర్మన్ మార్పు వ్యవహారానికి తెరపడనున్నది.

బగలాముఖి శక్తి పీఠాన్ని దర్శించుకున్న ఎంపీ బీబీపాటిల్



బగలాముఖి అమ్మవారిని దర్శించుకుంటున్న ఎంపీ బీబీపాటిల్

శివ్వంపేట, మార్చి 20 : మండలకేంద్రం శివ్వంపేటలోని బగలాముఖి అమ్మ వారిని బుధవారం జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ ఫౌండర్ శాస్త్రుల వెంకటేశ్వరశర్మ తీర్థప్రసాదాలు అందజేశారు. ఎంపీ వెంట శివ్వంపేట మాజీ సర్పంచ్, బీజేపీ మండలాధ్యక్షుడు పెద్దపులి రవి, నాయకులు మురళీయాదవ్, పబ్బ రమేశ్‌గుప్తా, రమణారావు, ఆంజనేయులుగౌడ్, అశోక్ ఉన్నారు.

ప్రభుత్వ భూములపై ఆరా

అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

పెద్దశంకరంపేట, మార్చి 20: పెద్దశంకరంపేట శివారులోని ప్రభుత్వ భూములను బుధవారం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పరిశీలించారు. అనంతరం తహసీల్ కార్యాలయంలో అధికారుల సమావేశమై, రికార్డులను పరిశీలించి, వివరాలు సేకరించారు. ప్రభుత్వ భూములను ఆక్రమించిన 8 మందికి నోటీసులు ఇచ్చినట్లు తహసీల్దార్ గ్రేసీబాయి తెలిపారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. భూముల పరిశీలనలో తహసీల్దార్ గ్రేసీబాయి, ఆర్ఐ శరణప్ప, సర్వేయర్ నాగరాణి ఉన్నారు.

నర్సాపూర్‌లో ఫ్లాగ్ మార్చ్

ఫ్లాగ్‌మార్చ్ చేస్తున్న పోలీసులు

నర్సాపూర్, మార్చి 20 : నర్సాపూర్ మున్సిపాలిటీతోపాటు మండలంలోని చిన్నచింతకుంట గ్రామంలో సీఐ జాన్‌రెడ్డి, ఎస్సై పుష్పరాజ్ ఆధ్వర్యంలో సీఐఎస్ఎఫ్ సెంట్రల్ ఫోర్స్ సిబ్బంది బుధవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్సై మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రూ.50 వేల కంటే ఎక్కువ నగదు తరలిస్తే దానికి సంబంధించిన పత్రాలను చూపించాలని సూచించారు. పోలీసులు, సెంట్రల్ ఫోర్స్ సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. సీఐఎస్ఎఫ్ సెంట్రల్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

పోష్టికాహారం అందించాలి

వెల్దుర్తి, మార్చి 20 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు రుచికరమైన పోష్టికాహారాన్ని అందించాలని నర్సాపూర్ ఆర్డీవో జగీదీశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం రామంతాపూర్‌తండాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి, విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులు నిర్లక్ష్యం వీడాలని, నాణ్యమైన, పరిశుభ్ర వాతావరణంలో వండిన భోజనాన్ని విద్యార్థులకు అందించాలన్నారు. ఆర్డీవో వెంట హెచ్ఎం నవీన్, గ్రామస్తులు ఉన్నారు.

గ్రంథాలయ భవన నిర్మాణానికి స్థల పరిశీలన

రేగోడ్, మార్చి 20: రేగోడ్‌లో గ్రంథాలయ భవన నిర్మాణానికి బుధవారం తహసీల్దార్ బాలలక్ష్మి, గ్రంథాలయ అధికారులు గ్రామకంఠం భూమిని పరిశీలించారు. గ్రంథాలయ నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరైనట్లు, త్వరలో భవన నిర్మాణ పనులను ప్రారంభిస్తామని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి వంశీకృష్ణ తెలిపారు. స్థల పరిశీలనలో లైబ్రేరియన్లు నరేందర్‌రెడ్డి, శంకర్, యాదగిరి, సుజాత ఉన్నారు.

గురుకుల పాఠశాలల్లో దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 20 : సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 6 నుంచి 8వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ చేయనున్నారు. 2024-25 విద్యాసంవత్సరానికి అర్హులైన విద్యార్థులు ఈ నెల 23లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లాకేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వరలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో కోరారు.

చేగుంట తైబజారు వేలం

వేలం నిర్వహిస్తున్న ఈవో నాగభూషణం

చేగుంట, మార్చి 20: మండలకేంద్రం చేగుంట పంచాయతీ కార్యాలయంలో బుధవారం తైబజారుకు వేలం నిర్వహించారు. చేగుంటకు చెందిన ఈసారాపు వెంకట్ గౌడ్ రూ.18.20లక్షలకు తైబజారును దక్కించుకున్నారు. వేలంపాటలో ఈవో నాగభూషణం, సిబ్బంది లింగం, శ్రీనివాస్, సత్యం, రాములు, స్వామి పాల్గొన్నారు.

రైతులందరికీ రుణాలు

రైతుకు చెక్కు అందజేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ చంద్రం

రామాయంపేట, మార్చి 20: ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో అర్హులైన రైతులకు రుణాలను ఇస్తామని రామాయంపేట పీఏసీఎస్ చైర్మన్ బాదె చంద్రం అన్నారు. మండలంలోని దంతెపల్లి గ్రామానికి చెందిన రైతు మెగావత్ చందర్‌కు కోళ్లఫారం షెడ్డు నిర్మాణానికి రూ.8 లక్షల రుణం మంజూరైంది. ఈ మేరకు బుధవారం పీఏసీఎస్ చైర్మన్ చంద్రం రైతుకు రుణ మంజూరు చెక్కు అందజేశారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ.. రుణాలను తీసుకున్న రైతులు వాయిదాలను సక్రమంగా చెల్లించాలన్నారు. సొసైటీ పరిధిలోని రైతులకు వ్యవసాయ భూమిపై రుణాలు ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో నర్సింహులు, సెక్రటరీ శ్రీనివాస్, డైరెక్టర్లు సుధాకర్‌రెడ్డి, ఐలయ్య, నిర్మల, లంబాది లక్ష్మి, లక్ష్మారెడ్డి ఉన్నారు.

కిశోర బాలికలకు ఐరన్ మాత్రలు

వెంకటాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న సూపర్‌వైజర్ సుజన

రామాయంపేట, మార్చి 20 : అంగన్‌వాడీ సెంటర్లలో కిశోర బాలికలకు ఐరన్ మాత్రలు అందజేస్తున్నట్లు రామాయంపేట ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజన తెలిపారు. బుధవారం ఆర్.వెంకటాపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలకు ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణులకు సీమంతాలు చేశారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ సుజన మాట్లాడుతూ.. ప్రతి గర్భిణీకి అంగన్‌వాడీ కేంద్రంలో సీమంతం చేసి, నూతన వస్త్రాలు, పండ్లు తదితర వస్తువులను అందజేస్తామన్నారు. చిన్నారులకు విద్యాబోధనతోపాటు పోషకాహారం అందజేస్తామని తెలిపారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. యుక్త వయస్సు బాలికలు ఐరన్ మాత్రలు తీసుకోవాలన్నారు. మహిళలందరూ ఆరోగ్యంపై దృష్టి పెడుతూ.. పోషకాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు అనుష్క, రాణి, పంచాయతీ కార్యదర్శి శ్యామల ఉన్నారు.

ఇద్దరు పిల్లలతో వివాహిత అదృశ్యం

ఇద్దరు కుమారులతో మల్లోత్ షీలా

చిలిపిచెడ్, మార్చి 20 : మండలంలోని బద్రియాతండాకు చెందిన వివాహిత ఇద్దరు కుమారులతోసహా అదృశ్యమైన ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై షేక్ మహబూబ్ తెలిపిన వివరాలు.. బద్రియాతండాకు చెందిన మల్లోత్ షీలా ఇద్దరు కుమారులతో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు భర్త శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. కొంతకాలంగా తమ మధ్య గొడవలు జరుగుతున్నాయని, పలుమార్లు పంచాయితీలు జరిగాయని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రమాదవశాత్తు కుంటలో పడి రైతు మృతి

మహిపాల్‌రెడ్డి(ఫైల్)

చిలిపిచెడ్, మార్చి 20 : కుంటలో పడి రైతు మృతి చెందిన ఘటన చిలిపిచెడ్ మండలం చండూర్ గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. చండూర్‌కు చెందిన మహిపాల్‌రెడ్డి(43) పొలం పనులకు వెళ్తున్నట్లు భార్య స్వప్నకు చెప్పి వెళ్లాడు. భర్త ఇంటికి తిరిగి రాకపోవడంతో భార్య పొలం వద్దకు వెళ్లింది. పొలం పక్కన ఉన్న కుంట కట్టపై బట్టలు, చెప్పులు కనిపించాయి. స్థానికులు కుంటలో గాలించడంతో మృతదేహం లభించింది. మహిపాల్‌రెడ్డి కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లి ప్రమాదవశాత్తు కుంటలో పడి మృతి చెందినట్లు భావిస్తున్నారు. మృతుడి భార్య స్వప్న ఫిర్యాదుతో ఎస్సై షేక్ మహబూబ్ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ దవాఖానాకు తరలించారు. మృతుడికి ఇద్దరు కుమారులు, తల్లి, భార్య ఉన్నారు.

పక్కాగా ఓటర్ల వివరాలు నమోదు

చిలిపిచెడ్: మాట్లాడుతున్న తహసీల్దార్ ముసాదిక్

వెల్దుర్తి: బీఎల్వోలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

చిలిపిచెడ్, మార్చి 20 : మండలంలోని ఆయా గ్రామాల్లో ఓటర్ల వివరాల నమోదు ప్రక్రియ పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మహ్మద్ ముసాదిక్ తెలిపారు. బుధవారం చిలిపిచెడ్ మండలంలోని శీలంపల్లి రైతువేదికలో బీఎల్వోలు, బీఎల్వో సూపర్‌వైజర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ముసాదిక్, శిక్షణ అధికారి శ్రీనివాస్ ఎన్నికల విధులను వివరించారు. బీఎల్వోలు గ్రామాల్లో ఓటరు జాబితా ప్రకారం ఇంటింటికీ తిరుగుతూ వివరాలు సేకరించాలన్నారు. ఓటరు జాబితాలో సవరణలు, మార్పులు, చేర్పుల ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. పరిశీలన పూర్తయిన ఓటరు జాబితాను పంచాయతీ కార్యాలయం వద్ద నోటీస్ బోర్డుపై ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఎల్వోలు, బీఎల్వో సూపర్‌వైజర్ వెంకటేశర్లు, ఎంపీఎస్‌వో వెంకటేశ్ పాల్గొన్నారు.

బీఎల్వోలకు శిక్షణ సదస్సు

వెల్దుర్తి, మార్చి 20 : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా నిర్వర్తించాల్సిన విధులపై బీఎల్వోలకు బుధవారం తహసీల్ కార్యాలయంలో శిక్షణ సదస్సు నిర్వహించారు. ఎన్నికల అధికారి శివశంకర్, తహసీల్దార్ తులసీరాం, ఆర్ఐ జయభరత్‌రెడ్డి తదితరులు వెల్దుర్తి, మాసాయిపేట మండలాలకు చెందిన బీఎల్వోలకు ఎన్నికల విధులపై అవగాహన కల్పించారు. ఓటరు జాబితాలో మృతుల ఓట్లతోపాటు రెండుచోట్ల ఓట్లు ఉన్నవారిని గుర్తించి, తొలిగించాలని సూచించారు. ఫారం 12డీపై అవగాహన కల్పించారు. 85 ఏండ్లు నిండిన వృద్ధులతోపాటు దివ్యాంగులు ఇంటి వద్ద ఓటు హక్కు వినియోగించుకునేలా (ఫారం-12డీ) చర్యలు తీసుకోవాలని సూచించారు. వందశాతం ఓటింగ్ జరిగేలా బీఎల్వోలు కృషి చేయాలన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★ I, THIRUPATHI SHANIGARAM, S/o. Shanigaram Balrajaiah, R/o. H.No. 12-4-89/10/C, Saraswathi Nagar, Medak Road, Siddipet, Siddipet Dist. In My Passport bearing No. K3166306, My Name mentioned as SHANIGARAM TIRUPATHI, S/o. Balrajaiah Shanigaram. Correct Name is THIRUPATHI SHANIGARAM, S/o. Shanigaram Balrajaiah. NT-667

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.